# మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగాఉండాలి..
- అవగాహన కార్యక్రమంలో షీ టీం ఇన్చార్జ్ నర్సింలు





**పరిగి ఆగస్టు 06 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** సైబర్ మోసాల పట్ల కార్మికులకు షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కలిగించిన పరిగి షీ టీం ఇంచార్జ్ నర్సింలు, బృందం వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, పరిగి డిఎస్పి శ్రీనివాస్ ఆదేశాల మేరకు, పరిగి పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల, గంజాయి, డ్రగ్స్, వంటి మాదకద్రవ్యాలు, మహిళలపై జరుగుతున్న దాడులు, డ్రంక్ అండ్ డ్రైవ్, వంటి అంశాలపై షీ టీం కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా షీ టిం అధికారులు మాట్లాడుతూ... విద్యార్థినులు, యువతులు, మహిళల రక్షణే ధ్యేయంగా సర్కారు వేర్వేరుగా షీటీం, భరోసా వ్యవస్థను అందుబాటు లోకి తీసుకువచ్చింది. ఈ రెండింటి విధానాలు వేరైనా ఆడపడుచులకు భద్రత, న్యాయం, వైద్యంతో పాటు మానసిక ధైర్యాన్ని అందిస్తున్నాయి. ఆకతాయిల ఆగడాలు, వారి వికృత చేష్టలతో బాధపడుతున్నామని విద్యార్థినులు, యువతులు, మహిళలు ఫిర్యాదు చేస్తే షీటీం బృందాలు మఫ్టీలో రంగంలోకి దిగుతాయి. నిఘా పెట్టి ఆకతాయిలను వలపన్ని పట్టుకుంటారన్నారు. ప్రాంతం,టైమ్ ఇవన్నీ ఫిర్యాదులో తెలియజేస్తే పోలీసులే అన్నీ చూసుకుంటారు. ఆకతాయిల నుంచి భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తెలెత్తకుండా చర్యలు చేపడతమని ఆయన తెలిపారు.

**బాల్య వివాహాలు నేరం**

చిన్న వయస్సులో వివాహాలు జరగడం వల్ల ఆడ పిల్లలు అనారోగ్యం పాలవుతారు. లైంగిక సంపర్కంతో బాటు, గర్భవతులు కావడం, హెచ్.ఐ.వి, రక్త హీనత సోకడానికీ, భగందరమనే వ్యాధిరావడానికి అవకాశం ఎక్కువ ఉంది. ఈ బాలికలకు హోదా శక్తి, పరిణతి లేకపోవడం వలన గృహ హింసకు, లైంగిక వేధింపులకు గురవుతారు. బాల్య వివాహాలతో చదువు ఆగిపోవడం, వలన పేదరికాన్ని అనుభవించవలసి వస్తుంది. లేత వయస్సులో ప్రసూతి మరణాలు, శిశు మరణాలు అధిక శాతంలో సంభవిస్తాయి

**మత్తు పదార్థాలు హానికరం**

మత్తు పదార్థాలు, గంజాయి శరీరానికి హాని చేస్తుంది. జీవితాలను అంధకారంలోకి నెట్టి వేస్తాయని పేర్కొన్నారు. క్షణికవేశంలో చేసిన పొరపాట్లకు జీవితాంతం పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. గంజాయికి అలవాటుపడి మానుకోలేని పరిస్థితి ఉన్న వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ సెంటర్‌లో ఉచితంగా కౌన్సిలింగ్ అందిస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, సాగు, విక్రయాలను చేస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం, సభ్యులు సావిత్రి, శోభా, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం,విద్యార్థులు,తదితరులు పాల్గొ న్నారు.

## కుస్మసముద్రంలో ఘనంగా
# తల్లీపాల వారోత్సవాలు



- అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా అన్నప్రాసన

**?కుల్కచర్ల ఆగస్టు 06 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** తల్లీపాల వారోత్సవాలను బుధవారం పురస్కరించుకొని వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం కుసుమ సముద్రం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గందె ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు తొలి అన్నప్రాసన చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గందె ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... నవజాత శిశువులకు తల్లిపాలు అమృతంతో సమానమని, బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు.

ఆరు నెలల దాటిన పిల్లలకు తల్లిపాలతో పాటు పోషకాహారం అందిం చడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ కార్య దర్శి వెంకటరెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్ శివ రాణి, అంగన్వాడీ టీచర్ గజ్జి ప్రసన్న, ఆయా లక్ష్మిలతో పాటు వార్డు సభ్యులు దొంగల గంగపురి, పులి భగవంతు, బాలిరెడ్డి, పులి యాదయ్య, గ్రామ మహిళలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## పరిగిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు
# పక్కా భవనం నిర్మించాలి



- జూనియర్ కళాశాలలో రెండు గదుల్లోనే డిగ్రీ తరగతులు నిర్వహణ
- జిల్లా అధికారుల స్పందించి నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలి
- ఏబీవీపీ పాలమూరు విభాగ్ కన్వీనం అర్జున్ సాతర్ల

**పరిగి ఆగస్టు 06 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** పరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కేవలం రెండు గదుల్లోనే డిగ్రీ తరగతులు నిర్వహించడం అత్యంత దురదృష్టకరమని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పాలమూరు విభాగ్ కన్వీనర్ అర్జున్ సాతర్ల అన్నారు. విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతున్నప్పటికీ, అందుకు అనుగుణంగా మౌలిక వసతులు లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ విద్యార్థులకు అవసరమైన ప్రత్యేక తరగతి గదులు, ఆధునిక ప్రయోగ శాలలు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్, సెమినార్ హాల్, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య వసతులు లేకపోవడం విద్యా నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. కనీస సౌకర్యాలు కూడా లేక చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి పరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రత్యేక నూతన భవన నిర్మాణం కోసం తక్షణమే నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అన్ని సౌకర్యాలతో విశాలమైన కళాశాల భవనాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణేష్ నాయక్, అరుణ్, రఘు, మణికంఠ, ప్రభాస్, సందీప్, సుశాంత్, శ్రీనివాస్, జస్వంత్, సాయి చరణ్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముజాహిద్ పూర్ ఆదర్శ పాఠశాలలో
# రాజకీయ రచ్చ

- పిల్లల ఎన్నికల్లో పెద్దల 'సోకులు'..
- ఉపాధ్యాయ బృందం తీరుపై తీవ్ర ఆరోపణలు..
- ఉపాధ్యాయులపై, ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి..
- బిఆర్ఎస్ నాయకుడు పోమాల అనంతయ్య



**కుల్కచర్ల, ఆగస్టు 06 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** అది విద్యార్థులకు క్రమశిక్షణ, ప్రజాస్వామ్య విలువలు నేర్పాల్సిన విద్యా నిలయం.. కానీ అక్కడ జరిగింది మాత్రం అధికార పార్టీ నాయకుల బరితెగింపు వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం ముజాహిద్ పూర్ ఆదర్శ పాఠశాలలో బుధవారం నిర్వహించిన విద్యార్థుల ఎన్నికల ముసుగులో అధికార పార్టీ నాయకులు చేసిన రచ్చ ఇప్పుడు గ్రామంలో అగ్గి రాజేసింది. విద్యాలయాలను తమ స్వార్థ రాజకీయ అడ్డాగా మార్చుకున్న తీరుపై బిఆర్ఎస్ పార్టీ నాయకుడు పోమాల అనంతయ్య విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్రమైన విద్యాసంస్థలో విద్యార్థులకు ప్రజాస్వామ్య విధానంపై అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన ఎలక్షన్స్ కాస్తా, అధికార పార్టీ నాయకుల ప్రచార ఆర్భాటానికి కేంద్రంగా మారడంపై సర్వత్రా విమర్శలు చేశారు.

**పిల్లల ఎన్నికల్లో పెద్దల 'సోకులు'..**

పాఠశాలలో విద్యార్థులు తమ నాయకులను ఎన్నుకోవడానికి ఓటు హక్కు వినియోగించుకోవాల్సింది చిన్నారులయితే, పాఠశాలతో ఎలాంటి సంబంధం లేని అధికార పార్టీకి చెందిన గ్రామస్థాయి నాయకులు తామే ఓటేస్తున్నట్లు పోజులిచ్చి ఫోటోలు దిగడం ఎంతవరకు సమంజసమని అనంతయ్య నిలదీశారు. విద్యార్థులు ఓట్లేసిన ఫోటోలు ఒక్కటైనా బయటకు రాలేదు కానీ, నాయకులు మాత్రం వాట్సాప్, సోషల్ మీడియా గ్రూపుల్లో ఫోటోలు పెట్టి "సోకులు పడడం" సిగ్గుచేటని అనంతయ్య మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటూ రాజకీయ ప్రచారాలు చేసుకోవడానికి బడులే దొరికాయా అంటూ ధ్వజమెత్తారు.విద్యార్థుల కోసం ఉద్దేశించిన కార్యక్రమాన్ని నాయకులు తమ స్వార్థ రాజకీయాలకు వాడుకోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

**ఏకపక్ష నిర్వహణపై విమర్శలు..**

పాఠశాల స్థాయిలో ఇంతటి ముఖ్యమైన కార్యక్రమం జరుగుతున్నప్పుడు మండల విద్యాశాఖ అధికారులు, పర్యవేక్షించాల్సి ఉండగా, వారు లేకుండానే కేవలం అధికార పార్టీ నాయకుల సమక్షంలో కార్యక్రమాలు నిర్వహించడం వెనుక అంతర్యమేమిటని గ్రామస్థులు, విపక్షాలు చర్చించుకుంటు న్నారని అనంతయ్య తెలిపారు. అంతేకాకుండా, పాఠశాల చైర్మన్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, గ్రామంలోని ప్రతిపక్ష పార్టీలైన బిఆర్ఎస్, బీజేపీ నాయకులను ఏ ఒక్కరిని ఆహ్వానించకుండా ప్రోటోకాల్‌ను పూర్తిగా తుంగలో తొక్కి ఈ కార్యక్రమాన్ని మసిపూసి మారేడు కాయ చేశారని ఆయన ఆరోపించారు.

**ఉపాధ్యాయ బృందం తీరుపై తీవ్ర ఆరోపణలు**

పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యాశాఖ అధికారులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని పోమాల అనంతయ్య తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాలలను రాజకీయ అడ్డాగా మారుస్తుంటే ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారు. అని నిలదీశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన పాఠశాల ఉపాధ్యాయులపై, విద్యాశాఖ అధికారులపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, విద్యాలయాల్లో ఇలాంటి రాజకీయ హడావిడి పునరావృతం కాకుండా చూడాలని అనంతయ్య డిమాండ్ చేశారు.

## మత్తు పదార్థాల
# రహిత సమాజమే లక్ష్యం

- ఓంశాంతి బ్రహ్మకుమారీస్ పరిగి ఇన్చార్జి పద్మ





**పరిగి, ఆగస్టు 06 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** దేశాన్ని రసాయన ఉగ్రవాదం, మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'నశా ముక్త్ భారత్ అభియాన్' (మత్తు పదార్థాల రహిత భారత్) కార్యక్రమంలో భాగంగా బుధవారం వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని పి.జె పారామెడికల్ కళాశాలలో ఓంశాంతి బ్రహ్మకుమారీస్ పరిగి ఇన్చార్జి పద్మ, న్యూ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ గౌతమ్, ఆకారపు రాజు, కృష్ణారెడ్డి, ల ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో చాలామంది విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతూ తమ బంగారు భవిష్యత్తును, విలువైన జీవితాలను పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు అయిన యువతను మార్గనిర్దేశం చేయడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ ఈ 'నశా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి మత్తు పదార్థాల దుష్పరిణామాలను గ్రహించి, వాటికి దూరంగా ఉంటూ చదువులో రాణించాలని పిలుపునిచ్చారు.విద్యార్థి దశలోనే సరైన మార్గదర్శకత్వం అందించాలనే ఉన్నతమైన ఉద్దేశంతో దేశ ప్రధాని నరేంద్ర మోడీ 'నశా ముక్త్ భారత్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలు, శారీరక, మానసిక అనర్థాల గురించి విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి, కష్టపడి పైకి వచ్చి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్క రూ క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడం ద్వారా చెడు అలవాట్లకు దూరం గా ఉండవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో పీజే కళాశాల ప్రిన్సిపల్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## దశరథ రెడ్డి మరణం సర్పంచుల
# సంఘానికి తీరని లోటు

- జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు బోయిని రాములు
- సర్పంచ్ మృతికి రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ ప్రగాఢ సానుభూతి



**దోమ, ఆగస్టు 06 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** మాతోటి సర్పంచిని కోల్పోవడం చాలా బాధాకరం వికారాబాద్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు బోయిని రాములు,వికారాబాద్ జిల్లా దోమ మండలం గొడుగోని పల్లి గ్రామ సర్పంచ్ దశరథ రెడ్డి, అకాల మరణం పట్ల వికారాబాద్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు పరిగి మండలం మాదారం సర్పంచ్ బోయిని రాములు తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఈ సందర్భంగా బోయిని రాములు మాట్లాడుతూ.. దశరథ రెడ్డి మరణం గొడుగోనిపల్లి గ్రామానికే కాకుండా మొత్తం వికారాబాద్ జిల్లా సర్పంచుల సంఘానికి తీరని లోటు. గ్రామాభివృద్ధి కోసం ఆయన నిరంతరం తపించేవారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే మంచి నాయకుడిని మనం కోల్పోయాం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటున్నాను అని రాములు పేర్కొన్నారు.

**సర్పంచ్ మృతికి తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ నాయకుల ప్రగాఢ సానుభూతి**

వికారాబాద్ జిల్లా దోమ మండలం గొడుగోనిపల్లి గ్రామ సర్పంచ్ దశరథ రెడ్డి, అకాల మరణం పట్ల తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు చింపుల సత్యానారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దశరథ రెడ్డి మరణం గొడుగోని పల్లి గ్రామానికే కాకుండా సర్పంచుల సంఘానికి తీరని లోటు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ, గ్రామా భివృద్ధికి శ్రమించిన నాయకుడిని కోల్పోవడం బాధాకరం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదిం చాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం అని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డికి నివాళి



**హనుమకొండ చౌరస్తా :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కి హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అండ్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ ఘనంగా నివాళులర్పించా రువరంగల్ జిల్లా నల్లబెల్లిలోని ఆయన నివా సంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి హెచ్ఆర్పీడబ్ల్యుఏవో ఫౌండర్ గొట్టిముక్కల మాధవాచారి, రాష్ట్ర అధ్యక్షుడు జినుకల నవనీత్ ముదిరాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

